# బంగారయ్య చచ్చాడు!

"బంగారయ్య చచ్చిపోయాట్ట.... శవం దొరికింది" తెల్లవారేపాటికి పుసులూరంతా గొల్లుమంది వార్త!

"ఆ.... నిజంగానా?" కొందరు ఆశ్చర్య పోయారు.

"చచ్చాడూ?.... పీడ వదిలింది" మృదువుగా అన్నారు మరికొందరు.

"ఆ...... బంగారయ్య ఏమిటి. చావటం ఏమిటి!" అనుమానాన్ని ప్రకటించిన వారూ లేకపోలేదు.

ఎవరేమనుకుంటేనేం బంగారయ్య చచ్చాడు; బంగారయ్య కొడుకు సత్యం శవాన్ని కారు మీద పుసులూరు తీసికొని వచ్చాడు; తండోప తండాలుగా జనం చూచి వస్తున్నారు బంగారయ్య శవాన్ని.

కాని, ఒక్కరు కాకపోతే, ఒక్కరైనా 'పాపం!' అన్న మానాన పోలేదు.

ప్రక్కింటి అబ్బాయికి పడిశెం పట్టిందన్నా, ఎదురింటి అమ్మాయికి ఆరోగ్యం బాగులేదన్నా, 600 ఏళ్ల క్రిందట భూకంపంలో 6 వేల మంది మరణించారన్నా, ఆటంబాంబు ప్రేలితే బహుళ ప్రజానీకం నశిస్తుందన్నా కళ్ళ వెంట నీళ్ళు జల జలా రాల్చి, చిర్రుని చీదే బడిపంతులు జోగయ్య గారి భార్య సైతం 'అయ్యో పాపం!' అనకపోగా, "పోయాడూ! పీడవిరగడయింది-" అంది.

"ఎన్ని కొంపలు ముంచి, ఎంత పాపాన్ని తెచ్చుకొన్నాడో.... ఇలాంటి దిక్కులేని చావు చచ్చాడు" అన్నారంతా.

లక్షాధికారి బంగారయ్య దిక్కులేని చావే చచ్చాడు....; శవం నీటిలో నాని, నాని, చివరికి గుర్తుపట్టలేని స్థితిలో మూడు రోజులకు చిక్కింది.

దిక్కు మొక్కులేకుండా, నెత్తిన గుడ్డతో పుసులూరు చేరిన బంగారయ్య... చివరికి గుర్తు పట్టలేని చావే చచ్చాడు.

★ ★ ★

సరిగ్గా 20 సంవత్సరాల నాటి మాట. బంగారయ్య నెత్తిన గుడ్డ వేసికొని పెళ్లాంతో సహా పుసులూరు చేరాడు. పుసులూరు చేరిన రెండు మూడు రోజులలోనే కరణం, మునసబుగార్లతో సంప్రదించి, పెదకాపుగారితో మాట్లాడి, ఒక పూరి గుడిసెలో కాఫీ, ఇడ్లీల వ్యాపారం సాగించాడు, క్రొత్తలో భుక్తికి కరువైనా, సరిక్రొత్త నాగరికతా విన్యాస విలాస భంగిమలతో పెంపొందుతూ, పట్టణపు పోలికలను తనలో పులుముకొంటున్న 'పుసులూరు'లో బంగారయ్య వ్యాపారం బాగనే సాగింది. గిర్రున సంవత్సరం తిరిగేపాటికి బంగారయ్య కాఫీ గుడిసె కాస్త పెంకుటిల్లు ఆకృతి దాల్చి 'బంగారు విలాస్'గా మారింది. ఆ సంవత్సరమే బంగారయ్య రూపాయికి అణా వడ్డీ వ్యాపారం, చిన్న చిన్న నగలు కుదవ పెట్టుకొని పైకం యిచ్చే వ్యవహారం మొదలెట్టాడు. మరో సంవత్సరం దాటేపాటికి, కాఫీ హోటలు మానివేసి టోకు వ్యాపారం, వడ్డీ వ్యాపారం, కాంట్రాక్టులు, కమీషన్ వ్యాపారంలోకి దిగింది, బంగారయ్య పని. పట్టిందల్లా బంగారమయింది. కమీషన్ వ్యాపారంలో రాబడి పెరిగి పోయింది.

వడ్డీ వ్యాపారం సహాయంతో... కొన్ని పేదల కొంపలను కూల్చేసి పెద్ద 'బంగారు నిలయా'న్నే కట్టించాడు బంగారయ్య.

పుసులూరు చేరిన నాలుగు సంవత్సరాలలో అదృష్టదేవత బంగారయ్యను అవహించి 'పుసులూరు లక్షాధికారి'గా నిలువపెట్టింది.

బంగారయ్య పెద్ద పలుకుబడిదారు; పెత్తందారు. బీదసాదలను వడ్డీతో పీల్చి పిప్పి చేసివేశాడు. దానధర్మాలు చేయటం కాని, ఇంట్లో వ్రతాలు, పండుగలు చేయటంకాని, లాంటి అలవాటు లేని బంగారయ్య లక్షాధికారి కాక మరేమౌతాడు?

ఎంగిలి చేత్తో కాకిని తోలటం వలన, కొన్ని మెతుకులు ఎలా నష్టమౌతాయో;

ఒక మెతుకే, ఒక బ్రతుకు కెలా సమమవుతుందో బంగారయ్యకు బాగా తెలుసు.

పిసినారి.... కర్కోటకుడు; దయ, కరుణ అనేవి కంచు కాగడాలతో వెదికినా పొరపాటునైనా కన్పించవు - గడువు దినానికి వడ్డీతో పైకం చెల్లించకపోతే, ఆ అభాగ్యుణ్ణి కోర్టు చుట్టూ త్రిప్పి ఖర్చులతో సహా రాబట్టేవరకు నిద్రించేవాడు కాదు. రావలసినదాంట్లో దమ్మిడి అయినా వసూలు కాకుండా వుండటానికి వీలులేదు; ఎవరైనా "దయ చూపండి" అన్నారా! వాళ్లకు మూడు రోజుల పాటు ఉపన్యాసమిచ్చి ఆ మహోపన్యాసంలో, తనెంత కష్టపడి 'దమ్మిడీలను' సంపాదించింది, తెలియ చెప్పేవాడు.

బంగారయ్య కొడుకు, సత్యం సైతం ఎన్ని విశాల భావాలు వున్నవాడైనా తండ్రిని చూచేపాటికి నోరెత్తలేక పోయేవాడు.

"కానీ వదలమనంగానే సరికాదు, ఆ 'కాని' సంపాదించు తెలుస్తుంది కష్టం, అనేవాడు సత్యాన్ని బంగారయ్య ఎప్పుడైనా, ఏ సందర్భంలోనైనా, "కాని" "అర్ధ" దగ్గర సత్యం కొద్దిగా తాత్సరంగా మాట్లాడితే. అంతేకాదు, ఆ రోజల్లా బంగారయ్య, కొంప మునిగినట్లు తనలో తనే అరచుకొంటూ, గుండెలు బాదుకుంటూ, తన తదనంతరం సత్యం ధనమెలా దుర్వినియోగ పరుస్తాడో ఊహించుకొంటూ, అలా వూహించుకొని 'అయ్యో!' అనుకొంటూ గడిపేవాడు.

అవకాశం చిక్కినప్పుడలా సత్యాన్ని పిలిచి, నాయినా! సత్యం!, 'ధనం', 'మానవుడు', 'విలువలు' అంటూ ఉపన్యాసం మొదలెట్టి చివరకు 'ధనం గొప్పది' అంటూ ముగించేవాడు, సత్యం మాత్రం, తనకు తండ్రి పద్ధతులు నచ్చకపోయినా, మాట మీరలేక, నోరు మూసికొని వూరుకోవలసి వచ్చేది.

'బంగారయ్య' అంటే చాలు, అందరి హృదయలలోను, "పిసినారి బంగారయ్యే" ప్రత్యక్షమయ్యేవాడు.

ఇంతకూ... ప్రాపంచికమైన సకల వస్తురాసులలోను, అతి ప్రధానమైన 'ధనం' అనబడే వస్తువుతో తన జీవితాన్ని గట్టిగా బంధించుకొన్న బంగారయ్య

అంత ధనాన్ని వదలి చనిపోతాడని ఎవరనుకొన్నారు.

అయినా "పాపీ చిరాయు!" అని - బంగారయ్యకు చావేమిటి?

★ ★ ★

మూడు రోజులు ఒకటే వర్షం, పడమర కొండల మీద కుండపోత పోసింది. తెల్లవారే పాటికి నల్లమడ నురుగులు కక్కింది. పుసులూరులోకి నీళ్ళు వచ్చాయి. పుసులూరులోకే నీళ్ళు వచ్చాయంటే దిగదల ఊరు 'పాలెం' మునిగిపోయింది అన్నారంతా!

ఇంకెక్కడి 'పాలెం' అంతా వరదలపాలు! 50 సంవత్సరాల క్రిందటి వరదల్లో పోయినట్లే సర్వం నాశనమయింది" అన్నారు, 6, 7 పుష్కరాలు గడిచిన పెద్దలంతా.

బంగారయ్య గుండెల్లో రాయి పడింది.

పాలెంలో రైతు 'రంగయ్య' యివ్వలసిన పైకం నాలుగు వేల రూపాయలు ఖాళీ అన్నమాట. వాడు కాస్త 'హరీ' అంటే తనకు క్షవరం. బంగారయ్య నలుగురయిదు గురిని సలహా అడిగాడు- "ఇంకెక్కడి రంగయ్య... పాలెమే, దక్కటం కష్టం" అన్నారంతా.

చివరికి బంగారయ్య 'పాలెం' వెళ్లటానికి నిశ్చయించాడు.

నల్లమడ 'ఉరుకు' 'పరుగుల' మీదుంటే బ్రహ్మదేవుడు కూడ వెళ్ళటం కష్టం.

"పాడు నాలుగు వేలు పోతేపోయాయి. వద్దు" అన్నారు బంగారయ్య ఇంట్లో!

కాని బంగారయ్య కళ్లలో నాలుగు వేల రూపాయల నోట్లు నీళ్ళలో పడి కొట్టుకొని పోతున్నట్లు కనిపించాయి. ఆ నీటిలో కొట్టుకొని పోతున్న నోట్లను తనెలాగైనా సాధించాలనిపించింది, బయలుదేరాడు - అతనిని ఆపటానికి జరిపిన ప్రయత్నం విఫలమయింది.

"నేను నేళ్లేపాటికి రంగయ్య కొన ప్రాణాలతో వున్నా పైకం పట్టుకొస్తాను-" అంటూ బయలుదేరాడు బంగారయ్య.

కనుచూపుమేర అంతా నీళ్ళే!

నల్లమడ దాటించటానికి ఎవరూ ముందుకు రాలేదు. చివరకు తనే, ఒక చిన్న పడవలో, బయలుదేరాడు, పాలెం కేసి ఆంతా ఆశ్చర్యంగా చూచారు. ఒడ్డు నుండి సత్యం 'వద్దు' అని కాళ్లా వ్రేళ్ళా పడి బ్రతిమాలాడు.

"పిచ్చివాడా! నాలుగు వేలకన్నా నా ప్రాణం గొప్పదా?" అని ప్రశ్నించాడు బంగారయ్య.

ఆ చిన్న 'డింగి' బయలుదేరింది, కనుచూపుమేరవరకు చూచారంతా... పడవను,, పడవ 'పాలెం'కేసి మలుపు తరిగింది,

అంతే! ఒకటి, రెండు, మూడు... రోజులు గడచిపోయాయి, వరద తగ్గుముఖం పట్టింది. కాని బంగారయ్య రాలేదు, అప్పటికే రహదార్లు బాగుపడ్డాయి. పాలెం, పుసులూరు మధ్య ప్రయాణాలు సాగినయి; పాలెం వరదకు కొద్దిగా నష్టపడ్డా, అంతగా నష్టపడలేదు, మురుగు కాలవ మూలంగా.

ఇంతకూ బంగారయ్య పాలెం, చేరలేదట. సత్యం 'పోలీసు రిపోర్టు' యిచ్చాడు,ం వెతికించాడు, నాల్గవనాడు ఆ వూరికి 5 మైళ్లలో మునిగిపోయిన పడవ కన్పించింది. ఆ పడవకు, అర మైలుపైన శవం దొరికింది. గుర్తు పట్టలేని స్థితిలో వుంది, శవం. బంగారయ్య కట్టుకొన్న నీరు కావిరంగు పంచె వలన గుర్తించారు, శవాన్ని. సత్యం కారులో తీసుకొని వచ్చాడు. ఉత్తర క్రియలు జరిపాడు. పెద్ద పెట్టున దినవారాలు నెరవేర్చాడు... బీద బిక్కికి అన్నదానం జరిగింది.

తన తండ్రి బ్రతికివుండగా చేసి పాపాలన్నీ కడిగివేయాలని సంకల్పించాడు సత్యం. తండ్రికి చేసిన కర్మలకే 40 వేల రూపాయిలు ఖర్చుచేసాడు. చాలమంది ప్రోనోట్లు త్రిప్పి యిచ్చివేశాడు. కుదవపెట్టబడి తమ దగ్గర వున్న సొమ్ములను, ఎవరివి వారికి యిచ్చివేసాడు. తండ్రి పేరుతో స్కూలు పెట్టడానికి 10 వేల రూపాయలు చందా ప్రకటించాడు.

బంగారయ్య చనిపోయిన 12 దినాలకల్లా సత్యం 50 వేల రూపాయిలు ఖర్చు చేసాడు. ప్రజా సౌకర్యార్థం, మరికొంత ధనాన్ని వినియోగిస్తానని పెద్దల ముందు ప్రకటించాడు.

"బంగారయ్య చచ్చాడు, ఊరు బాగుపడుతోంది" అన్నారంతా!

కాని 'విధి' దృష్టిలో, ఎలాంటి విచిత్ర సంఘటనలు జరుగుతాయో చెప్పలేం! విధివిలాస విన్యాస భంగిమల మాటులో, ఎంతటి ఆశ్చర్యాన్ని గొలిపే సంఘనటలు మాటు మణగివుంటాయో?

చచ్చాడన్న బంగారయ్య, సజీవంగా తిరిగి, 13వ రోజు, పుసులూరు గుండెలు బాదుకొంటూ వచ్చాడు, అందరి గుండెలు ఒక్కసారి ఆగి మళ్ళీ కొట్టుకొన్నాయి.

ఇంతకూ, చచ్చిన బంగారయ్య చావలేదట, ఆ పడవ తలక్రిందులవ్వగానే, నీటి వాలున ఈదుతూ, కొట్టుకొనిపోయాడట. చావవలసిన బంగారయ్య, అదృష్టం బాగుండి, ఒక తాటి దూలం దొరికింది; దాని సహాయంతో, సరిగా 10 మైళ్ళ దూరంలో వున్న ఊరి గట్టు చేరాడు బంగారయ్య. తీరా విచారిస్తే, అది రామాపురం అని, ఆ రామాపురంలో, 200 రూపాయలు ఇవ్వవలసినవాడు ఒకడున్నట్లు తెలిసింది; ఈ 13 రోజులు వాడి దుంపతెంచి ఆ పైకం వసూలుచేసికొని మరీ, తిరిగి కొంప చేరాడు బంగారయ్య ఈలోగా పుసులూరులో కావిరంగు పంచెగల శవాన్ని బంగారయ్య శవమని తగలపెట్టటం జరిగింది- 50 వేల రూపాయిలు నామరూపాలు లేకుండా హరించిపోయాయి. బ్రతికివున్న బంగారయ్యకు కర్మలు జరిగాయి.

చచ్చిన బంగారయ్య 13వరోజు వచ్చి సత్యం చేసిన ఖర్చు చూచి, గుండె ఆగి మళ్ళీ చచ్చాడు.

ఇంతకూ, బంగారయ్య చచ్చాడు! ●

## కథ వెనుక కథ :

*మిత్రుడు 'సత్యం' (శ్రీ తుర్లపాటి సత్యనారాయణ) తనకు తెలిసిన ఓ పిసినారిని గురించి చెప్పిన ఓ జోకు ఆధారంగా.*

★ *(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 4-2-1959)* ★